క్లుప్తంగా

బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వ సాయం



ఆర్థిక సాయం ఉత్తర్వులను అందజేస్తున్న తహసీల్దార్, ఏఓ

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు అలియాస్ రాయల్ అనే రైతు గత నెలలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తహసీల్దార్ శేషఫణి, ఏఓ మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సిఫార్సు మేరకు మృతుడి భార్య, నామినీ భార్య రంగమ్మ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా ద్వారా రూ.7 లక్షలను జమ చేసింది. ఈ మేరకు గురువారం తహసీల్దార్, ఏఓ నామినీకి నగదు జమ ఉత్తర్వులను అందజేశారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కుటుంబానికి సాయం అందించడంపై నామినీ రంగమ్మ, కుమారుడు మహేష్ ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



కంబదహాల్ బీసీ స్కూల్లో పనులపై ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కంబదహాల్ గ్రామ బీసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావుతో పనులపై చర్చించి, నిధుల వినియోగంపై సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులను నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. వీరి వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు ఉన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

ఓర్వకల్లు: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు తమ ఇళ్ల ముందు తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. ఆయన గురువారం మండలంలోని నన్నూరు సమీపంలో జగనన్న హౌసింగ్ కాలనీని డీఈ ప్రభాకర్, ఎంపీడీఓ శివనాగప్రసాద్‌తో కలిసి సందర్శించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలన్నారు. లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణ విషయంలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? సకాలంలో బిల్లులు, సిమెంట్, కడ్డీ, ఇసుక అందుతుందా? అనే అంశాలపై లబ్ధిదారులను ఆరా తీశారు. కాలనీలో మురుగునీరు, వర్షపు నీరు నిల్వవుండకుండా గుంతలు తవ్వుకోవడం మంచిదన్నారు. మండలంలో మొత్తం 60 ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో గుంతకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం సాయం మంజూరు చేస్తుందని చెప్పారు. హౌసింగ్ ఏఈ రామయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఉత్తమ లెక్చరర్‌కు సన్మానం



లెక్చరర్ వసంతను సన్మానిస్తున్న సిబ్బంది

గూడూరు రూరల్: జూలకల్ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కామర్స్ లెక్చరర్ వసంతను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల గురువారం ప్రిన్సిపాల్ దిల్షాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ టీచర్‌గా అవార్డుకు ఎంపిక కావడంపై రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

శిలాఫలకం ధ్వంసం



పోలకల్‌లో ధ్వంసమైన సచివాలయ శిలాఫలకం

సి.బెళగల్: మండలంలోని నూతన సచివాలయ భవన శిలా ఫలకంను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో సోమవారం ప్రారంభించిన గ్రామ సచివాలయం- 2 శిలాఫలకంను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయాన్ని గురువారం ఉదయం గమనించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రహదారులు బాగుపడి.. గని మెరుగుబడి

- కనీవినీ ఎరుగని రీతిలో మౌలిక సౌకర్యాల కల్పన
- రూ.30 కోట్లతో అంతర్గత రహదారులు, పొలాల రాస్తాలు, వాటర్ ట్యాంకుల నిర్మాణం
- రూ.90 లక్షలతో మద్దిలేరుపై వంతెనతో తీరిన కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



గని గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



బాగు చేసిన పొలాల రస్తా



నాడు-నేడు పనులతో రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాల



నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకు

గడివేముల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుండటంతో మండలంలోని గని గ్రామం అన్ని రకాల వసతులతో కళకళలాడుతోంది. ముఖ్యంగా రోడ్లు, పక్కా భవనాలు, సాగునీరు, తాగునీరు, పాఠశాలల అభివద్ధికి కోట్లాది రూపాయలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయించి పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో గని గ్రామం వికాసానికి చిరునామాగా మారింది. గ్రామంలో 1,078 ఇళ్లు ఉండగా 4,500 మంది జనాభా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో సుమారు రూ.30 కోట్లతో కనీవినీ ఎరుగని రీతిలో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంటు రోడ్లు, పక్కా భవనాలు

గని గ్రామంలో రూ.188.60 లక్షలతో రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండు ఆర్బీకేలు, రెండు హెల్త్ సెంటర్లు, ఒక మిల్క్ సెంటర్, అంబేడ్కర్ నగర్‌లో మహిళా సంక్షేమ భవనం నిర్మించారు. ఈ భవనాన్ని సామాజిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు. రూ.1.33 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించారు. ముఖ్యంగా పల్లెపాలెంలో రూ.34 లక్షలతో బీచ్‌కు వెళ్లేందుకు వీలుగా సిమెంటు రోడ్లు, ఎస్సీ కాలనీ సమీపంలో రూ.16 లక్షలతో చెల్లెమ్మగారి పట్టపుపాలెంలో రూ.30 లక్షలతో, క్రాంతినగర్‌లో రూ.30 లక్షలతో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించారు.

పొలాల రస్తాలు బాగు

గతంలో రస్తాలు బాగా లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. వర్షాకాలం వచ్చిందంటే మరీ కష్టంగా ఉండేది. అలాగే పండించిన దిగుబడులను ఇంటికి చేర్చాలంటే ఎన్నో తిప్పలు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.8 కోట్లతో 20 రస్తాలు బాగు చేశారు. దీంతో రైతుల ఇబ్బందులు తీరాయి. అలాగే వైకే తాండ అర్చ్ నుంచి రంగల్ ధర్వేషిఖాద్రి దర్గా వరకు రూ.2.5 కోట్లతో రోడ్డును ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాబార్డు కింద చెక్‌డ్యాం నిర్మించడంతో పాటు గ్రామంలోని పశువులకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని కాలనీల్లో రూ.55 లక్షలతో మురుగు కాలువలు నిర్మించారు.

వంతెన ఏర్పాటు

గని గ్రామ పరిధిలో వర్షం కురిస్తే సమీపంలోని మద్దిలేరు వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయేవి. సమస్యను ఉప సర్పంచ్ శివానందరెడ్డి ప్రత్యేక చొరతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రూ.75 లక్షలతో గని గ్రామం నుంచి మద్దిలేరు వాగుపై బ్రిడ్జితో పాటు కర్నూలు రోడ్డు వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి.

నాడు -నేడుతో పాఠశాలల అభివృద్ధి...

గని పంచాయతీలో నాడు నేడు పథకం కింద ఫేజ్-1లో పాఠశాలల అభివద్ధికి రూ.22.34 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఫేజ్-2లో దాదాపు రూ.కోటితో పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కావడంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల వసతులు కల్పించబడ్డాయి.

మౌలిక వసతుల కల్పన

గ్రామంలో రూ.3 కోట్లతో సిమెంటు రోడ్లను బీసీ కాలనీ, మెయిన్ రోడ్డు, జండమాన్ కాలనీ, బోయ పేట, మైనారిటీ కాలనీల్లో వేశారు. రూ.90 లక్షలతో రెండు వాటర్ ట్యాంకులను నిర్మించి పైపులైన్లను ఏర్పాటు చేశారు. గని మజారా గ్రామం వైకే తాండకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోలార్ కంపెనీ సామాజిక బాధ్యత కింద కేటాయించిన రూ.1.60 కోట్లతో గని చెరువులో పూడికతీత, ప్రధాన కట్టను బలపరిచే పనులు, తూముల ఆధునీకరణ, సీపేజీ నీరు రాకుండా రాతికట్టడం నిర్మాణాలు చేపట్టారు. దీంతో రైతుల అవస్థలు తీరిపోయాయి.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందాయి. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడంతో మౌలిక సౌకర్యాల కల్పన జరిగింది. గతంలో మా పంచాయతీలో తాగునీటి సమస్య ఉండేది. ఎమ్మెల్యే చొరవతో ఆ సమస్య పరిష్కారమైంది. గ్రామంలో మరిన్ని వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– కత్తి తులసమ్మ, సర్పంచ్, గని గ్రామం

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సహకారంతో గ్రామంలో దాదాపు రూ.30 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. పొలాల రోడ్లు పూర్తి కావడంతో రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి. మంచాలకట్ట చెరువు నుంచి ప్రత్యేక కాలువ తీసుకురావడంతో దాదాపు 300 ఎకరాలకు సాగునీరు అందుతోంది.

– శివానందరెడ్డి, ఉప సర్పంచ్, గని గ్రామం

ప్రజల చెంతకే పాలన



గని గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ తదితర కార్యాలయంలో నిర్మించడంతో పాటు సిబ్బందిని నియమించడంతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. గ్రామాన్ని ఇంతగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

–నాగమద్దమ్మ, ఎంపీపీ, గడివేముల

ఓటరు నమోదుకు సహకరించండి



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు నమోదుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం తహశీల్దార్ వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ .. ఇప్పటివరకు కోడుమూరు నియోజకవర్గంలో ఓటు హక్కు నమోదు కోసం 6 వేల దరఖాస్తులు వచ్చాయని, ఇంకా దరఖాస్తుల సంఖ్య పెరగాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండే వారందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని పాత బస్టాండ్ ఎలిమెంటరీ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల డీటీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయండి



సి.బెళగల్ సచివాలయంలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: గ్రామ సచివాలయాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శ్రద్ధ వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన స్థానిక గ్రామ సచివాలయం- 2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో అందిస్తున్న సేవలపై పంచాయతీ కార్యదర్శి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ.. సిబ్బంది విధులకు సకాలంలో చేరుకోవడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం వంటి సంక్షేమ పథకాలకు సబంధించి అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చేలా కృషి చేయాలని సూచించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



సి.బెళగల్‌లో రైతులకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధి హామీ అధికారులు

సి.బెళగల్: మండలంలోని పండ్లు, పూల తోటలను సాగు చేసుకునే రైతులకు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం అందిస్తుందని మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మండల రైతులతో సమావేశం నిర్వహించి, తోటల పెంపకం, నిర్వహణ, ప్రభుత్వ సహకారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యాన తోటలు సాగుచేసే రైతులకు మూడు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తోటల పెంపకంలో సమస్యలను పరిష్కరించేందుకు, మందులు, ఎరువుల అవసరాలకు నెలవారీ చెల్లింపులు చేస్తుందని, మండల రైతులు ఉద్యాన తోటల సాగుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్‌ఏలు, సీనియర్ మేట్లు, రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



కొండాపురంలో వరి సాగులో మెలకువలు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని గుండ్రేవుల, కొండాపురం గ్రామాలలో గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి పొలాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్‌ఎఫ్ – జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా వరిలో దోమల నివారణకు, మిత్ర పురుగులు, శత్రు పురుగుల గుర్తింపునకు స్వీప్ నెట్‌తో చేపట్టాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడం, పంటల సంరక్షణ పద్ధతులను వివరించారు. వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు, వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి పొలాల్లో వరి నాటు వేశారు. ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, వీఏఏ నాయక్, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



బాలికలకు ఐరన్ మాత్రలను అందిస్తున్న అధికారిణి హేమలత

కోడుమూరు: బాలికలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. శరీరంలో ఐరన్ లోపిస్తే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. రక్తహీనత తగ్గించేందుకు ఎండు ద్రాక్ష, పాలు, గుడ్లు, పండ్లు, వేరుశనగ కలిపి బెల్లం, ఆకుకూరలు తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, ఎంపీహెచ్‌ఎస్ కమాల్‌సాహెబ్, హెచ్‌ఎం ప్రసూన, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

గూడూరు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు సందర్శించారు. ప్రిన్సిపాల్ జరీనాతో మాట్లాడి నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. బాలికలతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొజుగు ప్రమీల ఉన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

కోడుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సృజన అధ్యక్షతన శుక్రవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయన్న గురువారం సూచించారు. ప్రజలు తమ సమస్యలుంటే స్పందన కార్యక్రమంలో విన్నవించాలని తహసీల్దార్ కోరారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఓర్వకల్లు: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా అన్నారు. ఓర్వకల్లు సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలపై సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సర్వే ఆధారంగా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా ప్రభుత్వమే అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. సచివాలయ కన్వీనర్లు సుధాకర్‌రెడ్డి, అనిల్, మహబూబ్‌బాష, సచివాలయ సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు



గుండ్రేవులలో హద్దు రాళ్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలో 3 గ్రామాల్లో సమగ్ర భూసర్వే ముమ్మరంగా సాగుతోందని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా మొదటి విడతలో సర్వే పూర్తి చేసిన పలుకుదొడ్డి, రెండవ విడతలో సర్వే చేపట్టిన గుండ్రేవుల, బురాన్‌దొడ్డి గ్రామాలలో గురువారం హద్దు రాళ్ల ఏర్పాటును రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఫైనల్ ఆర్వోఆర్ పూర్తయిన పలుకుదొడ్డి గ్రామానికి 1,939 సరిహద్దు రాళ్లు, అదేవిధంగా గుండ్రేవులకు 3,533, బురాన్‌దొడ్డికు 3,431 సరిహద్దు రాళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ నాగభూషణం ఆయా గ్రామాల వీఆర్వోలు శ్రీనివాసులు, తిరుపాల్, పాండురగయ్య గ్రామ సర్వే సహాయకులతో కలిసి రైతుల పొలాల్లో రోవర్లను ఉపయోగించి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయాలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని వీఏఏ సంధ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆంజేయులు అన్నారు. గురువారం ఉలిందకొండ గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన కూరగాయల అమ్మకం కేంద్రాన్ని సర్పంచ్ సుంకులమ్మ, నాయకులు శీనయ్య, జనార్దన్‌లతో కలసి ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ.. రసాయనాలు లేని వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అంతర పంటల లాభాలు, ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే ఘన, ద్రవ జీవామృతంచ కషాయాల తయారీ గురించి వివరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మేయర్ బీవై రామయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ అసోసియేషన్ నాయకులు

కల్లూరు: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ అసోసియేషన్ నాయకులు గురువారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రమిచ్చారు. సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ అయిన కార్మికులలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని కొరారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికుల సమస్యను పరిష్కరిస్తూ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్మికులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి రమేష్, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కోడుమూరు బాలుర హైస్కూల్ మైదానంలో హెచ్‌ఎం తైమూర్‌బాషా ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్రీడాపోటీలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆయా పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

పాణ్యం: ఈ నెల 23వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారని, వీరు ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికవుతారన్నారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిడ్ అథ్లెటిక్స్, తదితర క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నట్లు కో-ఆర్డినేటర్ చంద్రావతమ్మ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



గూడూరులో మండల సర్వసభ్య సమావేశ దృశ్యం

గూడూరు: గ్రామాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ సునీతమ్మ కోరారు. గురువారం స్థానిక వైకేపీ సమావేశ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల అభివృద్ధి పాటుపడాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాలలో రీసర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. నూతన ఓటరు జాబితా తయారు చేస్తుందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఏంపీడీఓ మాధవీలత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ సునీలమ్మ మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అందుకు స్థానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. నాడు -నేడు కింద ప్రతి పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఏఓ శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. వైకేపీ ఏపీఎం సుధాకర్, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, మండల పరిషత్ ఏఓ విజయసింహారెడ్డి, వైస్ ఎంపీపీ రాజమ్మ, కో-ఆప్షన్ మెంబర్ దౌల, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మేయర్, కమిషనర్

కల్లూరు: కల్లూరు అర్బన్ 41వ వార్డు ఎలుకూరు బంగ్లాలో గణనాథునికి మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవతేజ ప్రత్యేక పూజలు చేశారు. వారిని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, శాలువాలతో సత్కరించారు. కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులు కవినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే లక్ష్మీపురం పరిధిలోని లక్ష్మీనివాస్ కాలనీలో చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



లక్ష్మీనివాస్ కాలనీలో బహుమతుల పంపిణీ